బాలికల హాస్టల్‌కు మోక్షమెప్పుడో?

- నిర్మాణం పూర్తయి పదేళ్లు
- నేటి వరకు తెరుచుకోని వైనం
- నీటి సమస్యే ప్రధాన కారణం

డోర్నకల్: డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామ శివారులోని మోడల్ స్కూల్‌కు సంబంధించిన హాస్టల్ భవనం ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. 2013లో మోడల్ స్కూల్ ఆవరణలో రూ.1.25కోట్లతో హాస్టల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించగా 2015లో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 100 మంది బాలికలకు వసతి కల్పించే విధంగా 25 గదులను నిర్మించారు. ప్రతీ గదిలోనూ నలుగురు బాలికలకు వసతి కల్పించేలా ఐరన్ బెడ్లు, చైర్లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం ప్యూరీఫయర్ వాటర్ మిషన్, బాలికలు స్నానాలు చేసేందుకు భవనంపైన సోలార్ వాటర్ హీటర్ అమర్చారు. భవన నిర్మాణం పూర్తయిన నాలుగేళ్ల తరువాత అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. కాని నేటి వరకు హాస్టల్ భవనం తెరుచుకోలేదు.

నీటి సమస్యే ప్రధానం..

మోడల్ స్కూల్‌లో సుమారు 700మంది విద్యార్థులు ఉండగా తరచూ నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల నిర్మించిన ప్రాంతం సొడు నేల కావడంతో భూగర్భ జలాలు తక్కువ స్థాయిలో ఉండటం, పాఠశాల ఆవరణలో ఐదారు చోట్ల బోర్లు తవ్వించినా నీరు పడకపోవడం, ఒక చోట నీరుపడి బోరు ఏర్పాటు చేసినా అరకొరగా నీరు ఇస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలకు మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసినా నాలుగు రోజుల కొకసారి నీరు సరఫరా అవుతుండడంతో నీటి కొరత ఉన్న రోజుల్లో పాఠశాల సిబ్బంది బయట నుంచి నీటిని సరఫరా చేసుకుంటున్నారు. హాస్టల్‌లో వంద మంది బాలికలకు వసతి కల్పించాల్సి ఉండడంతో ప్రతీ రోజు వారి అవసరాలకనుగుణంగా నీటిని సరఫరా చేయాల్సి ఉండడం, నీటి కొరత ఉండటంతో హాస్టల్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరోవైపు హాస్టల్ భవనం నుంచి వృథా నీరు పంట పొలాల్లోకి వెళ్లే అవకాశాలు ఉండటంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

తుప్పు పడుతున్న పరికరాలు..

సుమారు ఎనిమిదేళ్ల క్రితం వంద మంది బాలికల కోసం బెడ్లు, చైర్లు, టేబుళ్లు, వంట సామగ్రి తదితర పరికరాలు సరఫరా చేయగా వాటిని వినియోగించకపోవడంతో ప్రస్తుతం తుప్పు పడుతున్నాయి. భవనం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. అధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి తక్షణమే హాస్టల్‌ను ప్రారంభించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు..


మోడల్ హాస్టల్ భవనం


తుప్పు పడుతున్న టేబుళ్లు


భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

క్లుప్తంగా

పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

నర్సింహులపేట: పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని వంతడపల స్టేజీ వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పెద్దలకు అభినందనలు తెలిపారు.

మండల వాసికి అత్యున్నత గౌరవం

పెద్దవంగర: మండలంలోని సర్పంచ్‌తండాకు చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ డిప్యూటీ స్పీకర్‌గా నియమితులయ్యారు. ఈ విషయం తెలిసిన మండల ప్రజలు, తండా వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు జాటోతు నెహ్రూనాయక్ మాట్లాడారు.

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు శుభాకాంక్షలు

మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్‌గా నియామకమైన డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్‌ను ఆదివారం మరిపెడ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహమ్మద్ రియాజ్ పాషా, ప్రధాన కార్యదర్శి రాంపెల్లి వీరాంజి, గౌరవసలహాదారుడు షేక్ సత్తార్‌పాషా, గోవర్ధన్, జిన్నా లచ్చయ్య, అక్తర్ షాఫా, మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి, పెండ్లి శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో భక్తుల సందడి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో సందడిగా మారింది. పాఠశాలలకు సెలవులు ముగుస్తుండడం, వర్షాకాలం ప్రారంభం కానుండడంతో భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు బారులుదీరారు. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సంతలో ఎమ్మెల్యే



బయ్యారం: పలు కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపే నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం వారాంతపు సంతలో కూరగాయలు కొనుగోలు చేసి చూపరులను ఆశ్చర్యానికి గురి చేశారు. గార్ల మండల పర్యటనను ముగించుకొని ఇల్లెందు వెళ్తున్న ఎమ్మెల్యే మండలంలోని గంధంపల్లి-కొత్తపేట సంతలో ఆగారు. కూరగాయలను కొనుగోలు చేశారు.

నాయకుల సంబురాలు



డోర్నకల్/దంతాలపల్లి: డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ డిప్యూటీ స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కాసం శేఖర్, మాదా శ్రీనివాస్, కేశబోయిన కోటిలింగం, శీలం శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, నానియాదవ్, తాళ్లూరి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, సుశీల్‌జైన్ పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంటతండా సమీపంలో ఆదివారం ఓ రైతుకు చెందిన జామాయిల్ తోట నిప్పంటుకుని దగ్ధమైంది. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన జడ రమేష్ గుర్రాలకుంటతండా సమీపంలో 15ఎకరాల జామాయిల్ తోటను సాగు చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో జామాయిల్ తోటకు నిప్పంటుకుని చెట్లు దగ్ధమయింది. సమీప ప్రాంత రైతులు మంటలను ఆర్పగా సుమారు ఐదెకరాల విస్తీర్ణంలోని జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయని రైతు జడ రమేష్ వాపోయాడు.

మున్నేరు జలాలు అందేలా ప్రణాళిక ఇవ్వాలి

గార్ల: మున్నేరు ప్రాజెక్టు నిర్మించడం ద్వారా మండలంలోని రైతాంగానికి నీరు అందేలా ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని మున్నేరు ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, వెంకట్‌లాల్, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి స్వాతంత్ర్య సమరయోధుడు తొడేటి కొమరయ్య శత జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

కొనసాగుతున్న 'బడిబాట'


పెద్దవంగర: బడిబాటలో ఉపాధ్యాయులు


నర్సింహులపేట: బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ రామ్మోహన్‌రావు


గూడూరు: బ్రాహ్మణపల్లిలో..


కురవిలో..

పెద్దవంగర/కురవి/గూడూరు/నర్సింహులపేట/బయ్యారం: మా బడిలో ఉచిత విద్యతోపాటు అన్ని సౌకర్యాలున్నాయి.. మా బడిలో పోటీ ప్రపంచానికి తగ్గట్టు విద్యను అందిస్తున్నాం.. మీ పిల్లలను మా బడికి పంపండి అంటూ ఉపాధ్యాయులు ఎన్నికల ప్రచారంను మరిపించేలా బడిమాట నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉపాధ్యాయులు బడీడు పిల్లల ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని భక్తితో పూజిస్తే భగవంతుడు కోరిన కోరికలు తీరుస్తాడని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని మధనతుర్తి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీభక్త మార్కండేయ స్వామి, పార్వతి, గణపతి, సుబ్రహ్మణ్య, నందీశ్వర నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వేద బ్రాహ్మణులు మణికొండ విజయ్ శర్మ, శ్రీనివాసశర్మ, సంపత్ శర్మ, శణ్ముఖ రాజ శర్మ సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యే పూజలు చేశారు. విగ్రహ దాత కొప్పు కరుణాకర్, భక్తులకు గ్రామానికి చెందిన మంగి రవి విజయ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అనపర్తి వెంకటేశ్వర్లు, కొప్పు జనార్దన్, కొప్పు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పేదల కల నెరవేరుస్తున్న ప్రభుత్వం

కురవి: పదేళ్ల నుంచి అర్హులైన నిరుపేదలకు పక్కా గృహాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, పేదల కల నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, కురవి ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నేరడ గ్రామంలో ఎస్‌కె సైదాబీ అనే మహిళకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కురవి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దయ్యాల శ్రీధర్, గద్దె లింగన్న, చందు నాగన్న, తాజుద్దీన్, దిలీప్, మల్లయ్య పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న నాయకులు

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

గార్ల: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం 11సంవత్సరాల పదవీ కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రామచంద్రునాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి విమల్‌కుమార్‌జైన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. దేశ ప్రతిష్టను మోదీ అంతర్జాతీయంగా పెంపొందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివకృష్ణ, నాగేంద్రబాబు, దేవా, సత్యనారాయణ, దేవేందర్, వీరస్వామి, రాంబాబు, ఠాగూర్, బుచ్చిబాబు, సాయికృష్ణ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మహబూబాబాద్ రూరల్: బాలిక అదృశ్యమైన ఘటనలో సంబంధిత బాధితులు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని బాలసదనంలో గల ఓ బాలిక మధ్యాహ్నం సమయంలో ఎవరికి చెప్పకుండా అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయింది. బాలసదనం నిర్వాహకులు బాలిక బయటకు వెళ్లిన దృశ్యాలను సీసీ పుటేజీల్లో చూసినప్పటికీ ఎలాంటి సమాచారం రాకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సీతారామ జలాలను తీసుకురావాలి


మాట్లాడుతున్న నాయకులు

బయ్యారం: బయ్యారం పెద్దచెరువుకు సీతారామ జలాలను తీసుకరావడంతోపాటు కాల్వలకు మరమ్మతులు చేయాలని కోరుతూ ఈనెల 13న బయ్యారంలో ఆందోళన చేపట్టనున్నట్లు పలు పార్టీల నాయకులు తెలిపారు. ఆదివారం బయ్యారంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో న్యూడెమోక్రసీ, సీపీఎం, మాస్‌లైన్, సీపీఐ నాయకులు గౌని ఐలయ్య, మండా రాజన్న, ముల్కూరి జగ్గన్న, సారిక శ్రీను మాట్లాడారు. గోదావరి జలాలను బయ్యారం పెద్దచెరువుకు తీసుకొస్తామని గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ పాలకులు హామీలు ఇచ్చి రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు మధు, వీరభద్రం, కళింగరెడ్డి, వెంకన్న, మురళీ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ నియంత్రించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల గౌతం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి బొట్ల గౌతం హాజరై మాట్లాడుతూ.. పేద మధ్య తరగతి సామాన్య తల్లిదండ్రులను వివిధ ప్రైవేట్ విద్యాసంస్థలు రకరకాల పేర్లతో ఇష్టానుసారంగా ఫీజుల వసూలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫీజుల నియంత్రణ జీఓలను అమలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలు పునఃప్రారంభించే క్రమంలో బడుల్లో మౌళిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బానోతు నందీశ్వర్, రవీందర్, రామ్, చరణ్, నరేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతం

అర్ధరాత్రి కూలిన పెంకుటిల్లు

- ఐదుగురికి తప్పిన పెనుప్రమాదం

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు తోటదస్రుతండాలో ఓ పెంకు ఇల్లు నేలకూలగా, ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఐదుగురు ప్రాణాపాయం నుంచి బయటపడిన సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. తండావాసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. నిరుపేద కుటుంబానికి చెందిన అపావట్ రాజునాయక్ భార్య లక్ష్మి దంపతులు శిథిలావస్థకు చేరిన పెంకు ఇంట్లో నివాసము ఉంటూ జీవనం గడుపుతున్నాడు. వారితో పాటు కొడుకు రాజన్న, అత్త దస్మ, మామ రాజు ఉంటున్నారు. ఇంటి మొగరాలు శిథిలావస్థకు చేరుకుని కూలే ప్రమాదం ఉండగా, వాటికి అడ్డుగా కర్రలను పెట్టారు. ఈ క్రమంలో రాత్రి ఈదురు గాలి వీస్తుండగా, కుటుంబ సభ్యులు నిద్రలోకి జారుకున్నారు. ఒక్కసారిగా శిథిలావస్థలకు చేరిన పెంకు ఇల్లు శబ్దం చేసుకుంటూ నేలకూలింది. నిద్రిస్తున్న వారిపై కర్రవాసాలతోపాటు పెంకులు పడ్డాయి. తండావాసులు ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటికి తీసుకొచ్చారు. గాయాలైన ఐదుగురిని వెంటనే 108లో నర్సంపేట ఆసుపత్రికి తరలించారు.


నేలకూలిన ఇల్లును పరిశీలిస్తున్న తండావాసులు

మృగశిర కార్తె.. చేపల గిరాకీ భలే


డోర్నకల్: బైపాస్ రోడ్డు చేపల దుకాణం వద్ద రద్దీ


కేసముద్రం: చేపలను కొనేందుకు వచ్చిన ప్రజలు

డోర్నకల్ /కురవి/బయ్యారం/కేసముద్రం: మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలకు గిరాకీ పెరిగింది. మృగశిర కార్తె మొదటి రోజున చేపల తినాలనే నమ్మకంతో ప్రజలు చేపల కోసం క్యూ కట్టారు. స్థానిక చేపల మార్కెట్‌లో వ్యాపారులు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి కేజీ చేపలను రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయించారు.

సంక్షిప్త సమాచారం

రూ.21వేల ఆర్థికసాయం



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి గ్రామానికి చెందిన కొండ నాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు స్పందించిన కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 2002–03 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.21వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ముదిగిరి చిన్న సాంబయ్య, జక్కుల ఉదయ్, కళింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్

డోర్నకల్: మాలమహానాడు తొడేళ్లగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడిగా బందెల పవన్‌కల్యాణ్‌ను నియమించినట్లు సంఘం మండల అధ్యక్షుడు పగిడిపల్లి నాగేశ్వర్‌రావు తెలిపాడు.

నేడు రెవెన్యూ సదస్సులు

బయ్యారం: మండలంలోని కొత్తపేట, జగత్‌రావుపేటల్లోని పంచాయతీ కార్యాలయాల ఆవరణంలో నేడు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సంతులాల్ పోడుతండా పంచాయతీ పరిధిలోని రైతుల సమస్యలపై వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

గూడూరు: శ్రీకృష్ణుడు బోధించిన అసలైన జ్ఞానం భగవద్గీతలో ఉంటుందని, అదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని ప్రబోధ సేవ సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. మండలంలోని బొల్లెపల్లిలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు రజిత, సంతోష్, సాయి, చిన్మయి, పాపక్క, ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తండా ధర్మారం రెవెన్యూ పరిధిలోని లచ్చతండా గ్రామానికి చెందిన గుగులోతు సోనియా జేఈఈ అడ్వాన్స్ ఎస్టీ కేటగిరి ఆల్ ఇండియాలో 63వ ర్యాంకు సాధించింది. విషయం తెలిసిన అదే గ్రామ పంచాయతీకి చెందిన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్పీసీబీ) సభ్య కార్యదర్శి గుగులోతు రవినాయక్ సోనియాను ఆదివారం శాలువాతో ఘనంగా సన్మించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సెంటర్‌లో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టి ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడారు. మద్యం తాగి వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, వాహన పత్రాలు లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇతర నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక


శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షుడు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రడం శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యాడు. ఆదివారం మున్సిపాలిటిలోని శ్రీవివేకవర్ధినీ హైస్కూల్‌లో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కదిర శ్రీనివాస్, కోశాధికారి పెదగాని సురేందర్, ఉపాధ్యక్షులు ఉటుకూరి శ్రీనివాస్, గాజగోని వీరన్న, కార్యదర్శులు చింతనూరి సతీష్, ఉట్కూరి రవిశంకర్, సహాయకోశాధికారి అశోక్, ముఖ్య సలహదారులుగా చిర్ర యాకాంతంగౌడ్, రడం పెద్ద వెంకన్న, రడం చిన్నవెంకన్న, ఉట్కూరి అశోక్, కొత్త శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

బియ్యం అందజేత

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని 11వ వార్డు హస్తినాపురం కాలనీకి చెందిన గంధసిరి కొమరయ్య ఈనెల 5వ తేదీన మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బోడ రవికుమార్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50కిలోల బియ్యం అందించాడు.

అగ్ని ప్రమాదం

కురవి: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంకు పక్కన ఖాళీ స్థలంలో ప్రమాదవశాత్తు కట్టెలకు నిప్పంటుకుని ఆదివారం మంటలు వ్యాపించాయి. నిప్పురవ్వలు పెట్రోల్‌బంకుపై పడే అవకాశం ఉండడంతో అప్రమత్తమైన పెట్రోల్ బంకు సిబ్బంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక శాఖ అధికారులు వాహనాన్ని తీసుకొచ్చి మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

యువకుడికి తీవ్రగాయాలు

బయ్యారం: మోటార్‌సైకిల్‌పై నుంచి పడి ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం బయ్యారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం గుండ్రాతిమడుగు(స్టేషన్)కు చెందిన తునగర్ నాగేందర్ మోటార్ సైకిల్‌పై బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎస్‌బీఐ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నేడు ఈదులపూసపల్లి దర్గాలో ఉర్సు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో గల హజరత్ సయ్యద్ ఇమామ్ షావలి దర్గాలో సోమవారం ఉర్సు ఉత్సవం నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి షేక్ అన్వర్ తాజి నిజామి ఆదివారం తెలిపారు. మానుకోట తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకువచ్చిన సందల్ (గంధం) సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. మగ్రిబ్ నమాజ్ అనంతరం రాత్రి 7 గంటలకు లంగర్(భోజనం) కార్యక్రమం ఉంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



డోర్నకల్: స్థానిక నిర్మలా హైస్కూల్‌లో ఆదివారం 1999–2000 సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బోరగళ్ల శరత్, బడేటి ఉపేందర్, కొత్త వంశీ, గురుస్వామి, సృజన, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


రేషన్ షాపును ప్రారంభిస్తున్న యుగేందర్‌రెడ్డి

మరిపెడ: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని రామవిలాస గల్లీ బోరా సరసత్వలింగమూర్తిల కొత్త రేషన్ షాపు –21ని యుగేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే ప్రజల పక్షపాతి అని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐలమల్లు, రాంలాల్, శ్రీపాల్‌రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.